క్లుప్తంగా

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. విషయాన్ని తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామంలో పర్యటించి, శ్రీరాములును కలిసి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన గ్రామ పెద్ద కొండప(92) కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, అరకు వైస్ ఎంపీపీ రామన్న, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, నాయకుడు సింహాచలం తదితరులున్నారు.

నేటి నుంచి ఉద్యోగులకు ఫేషియల్ హాజరు

అడ్డతీగల: ఉద్యోగులందరికీ సోమవారం నుంచి ఫేషియల్ హాజరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కె..బాపన్నదొర తెలిపారు.ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు వెలువడ్డాయన్నారు.ముఖ్యంగా గ్రామ సచివాలయాల్లోని అన్ని విభాగాల సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫేషియల్ హాజరు విధానాన్ని అనుసరించాల్సి ఉందన్నారు. గత నెల 17 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో హాజరు వేయడం లేదన్నారు. దీంతో సోమవారం నుంచి తప్పనిసరిగా అన్ని విభాగాల సిబ్బంది ఉదయం 10.10 గంటలకు సాయంత్రం 5.30 గంటల తరువాత ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని సూచించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు


డముకు సమీపంలోని రోడ్డుపై మట్టి కుప్పలు

అనంతగిరి: మండలంలోని డముకు నిమ్మలపాడు రోడ్డులో సెల్ టవర్ల నిర్మాణం భాగంగా కేబులు లైన్ల కోసం గోతులు తీశారు. లైన్ పనులు పూర్తిచేసి గోతుల్లో మట్టి సక్రమంగా వేయకపోవడంతో రహదారిపైకి మట్టివచ్చి ప్రమాదభరితంగా మారింది. దీంతో అటువైపుగా ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మట్టిపై వాహనాలు జారుతున్నాయంటూ వాహనదచోకులు వాపోతున్నారు. రోడ్డుపై అవగాహన పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డుపైకి వచ్చిన మట్టిని తీసి పక్కకు వేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నేడు గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం

పాడేరు రూరల్ : కొత్తగా నియమితులైన గృహ సారథులు, గ్రామ సచివాలయ, మండల కన్వీనర్లతో సోమవారం ఉదయం 11 గంటలకు పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆడిటోరియంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ట్రైకార్ చైర్మన్ పాల్గొంటున్నట్టు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ

అడ్డతీగల: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా హెల్త్‌వర్కర్లు నియమించాలన్నారు. విద్యార్థులు అనారోగ్యాలతో మరణాల బారిన పడకుండా తదుపరి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కూరగాయల సాగు... లాభాలు బాగు


డుంబ్రిగుడలో సాగు చేస్తున్న క్యాబేజీ పంట

- సేంద్రియ పద్ధతిలో సాగు
- ఆశాజనకంగా ధరలు

జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కూరగాయాలు సాగుతో గిరిజన రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. చెక్‌డ్యామ్‌లు, చెరువులు, కాల్వలు, గెడ్డలు నీరు మళ్లించి భూముల్లో కూరగాయలు, ఆకుకూరలు వంటివి విస్తారంగా పండిస్తున్నారు. పాడేరు, అరకులోయ నియోజకవర్గాలోని మండలాల్లో ఎక్కువగా కూరగాయల పంటలు వేస్తున్నారు. జి.మాడుగుల మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ గన్నేరుపుట్టు, సొలభం పంచాయతీ దిగకంఠవరం వంజరి పంచాయతీ కిల్తారి, కృష్ణాపురం, గొప్పువీధి తదితర గ్రామాలతో పాటు నుర్మతి పంచాయతీలోను ఎక్కువగా కూరగాయల పంటలు పండిస్తున్నారు. చింతపల్లి, జికెవీధి, కొయ్యూరు, పాడేరు మండలాల్లో పలు గ్రామాల్లో 300 ఎకరాల్లోను, అరకు నియోజకవర్గంలో డుంబ్రిగుడ, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల్లో పలు గ్రామాల్లో 800 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలను, బంగాళాదుంపులు, క్యాలీఫ్లవర్, క్యారెట్ తదితర పంటలను సాగు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతోనే ఆయా పంటలు పండిస్తున్నారు. ఏజెన్సీలో జరిగే వారపు సంతలకు రైతులు తీసుకొచ్చిన కూరగాయలకు, ఆకు కూరలు మైదాన ప్రాంతాల వ్యాపారులు కొనుగోళు చేసి తరలిస్తున్నారు.

విస్తారంగా క్యాబేజీ

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం, బెడ్డగుడ, బైలుగుడ ,కంద్రుం, దేముడువలస, సొవ్వా, కొర్రాయి, జాముగుడ, అంత్రిగుడ తదితర గ్రామాల్లో క్యాబేజీ విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ వేసవి కాలంలో సుమారు 420 ఎకరాల్లో సాగుచేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న క్యాబేజీకి మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువగా ఉంది. దీంతో వ్యాపారులు వచ్చి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది రైతులు వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. ధరలు ఆశాజనకంగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. క్యాబేజీకి డిమాండ్ ఉండడంతో రైతులు మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు.


బందవీధి-పాడేరు రోడ్డులోని గన్నేరుపుట్టులో కూరగాయల విక్రయాలు

ఏజెన్సీలో కూరగాయల ధరలు(కిలో)

టమాటా	రూ.40
బంగాళదుంపలు	రూ.40
మిర్చి	రూ.60
వంకాయలు	రూ.50
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.60
బీట్‌రూట్	రూ.50
ఉల్లిపాయలు	రూ.20
క్యాలీఫ్లవర్	రూ.30

ధర బాగుంది



క్యాబేజీకి వారపు సంతల్లో గిట్టుబాటు ధర బాగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుత సీజన్‌లో దిగుబడి బాగా వచ్చింది. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఆశించిన ధరలు వస్తున్నాయి.

– కె.రాంప్రసాద్, రైతు, సొవ్వా, డుంబ్రిగుడ మండలం

పూర్తిస్థాయిలో సూచనలు



గిరిజన రైతులకు కూరగాయలు, ఆకు కూరల సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలిస్తున్నాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటించి పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయిల్ ఇంజిన్లు కోసం రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మంజూరైతే సబ్సిడీపై పంపిణీ చేస్తాం.

–పద్మ, హార్టీకల్చర్ అధికారి, డుంబ్రిగుడ

ఆనందంగా ఉంది

సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాం. గ్రామంలో తొమ్మిది కుటుంబాలు వారు 15 నుంచి 20 ఎకరాల్లో సంవత్సరం పొడవునా కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. పంటలను పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని వారపు సంతలకు తరలించి విక్రయిస్తున్నాం. కూరగాయలకు ఆకుకూరలకు గిట్టుబాటు ధరలు వస్తుండడంతో ఆనందంగా ఉంది.

– కిల్లో మధు, గన్నేరుపుట్టు, జి.మాడుగుల మండలం

వ్యవసాయ సామగ్రి పంపిణీ


సామగ్రిని అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పాడేరు రూరల్: మండలంలోని డి.గొందూరు పంచాయతీ వాకపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. విశాఖపట్నానికి చెందిన చేయూత ఫౌండేషన్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సహకారంతో గిరి రైతులకు గునపం, పార, గమేలా వంటి వ్యవసాయ సామగ్రితో పాటు దుప్పట్లు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యమైన జీవితం గడపాలని స్పందన చేయూత చైర్మన్ ఊపురి బుచ్చిరాజు సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో స్పందన ఫౌండేషన్ సంస్థ సేవలు మరింత విస్తరింపజేయాలని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు కోరారు. లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ ఆలపాటి సుబ్బారావు, ప్రతినిధులు ప్రమోద్ సాహూ సీతారామరాజు, వైకే గార్ల, జయలక్ష్మి, శ్రీధర్, సుధా, ఎం.ఎస్.ఎన్. మూర్తి, సరోజిని, లక్ష్మణ్, లత, రేఖా, జీఎం నాథ్, గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుకు డిమాండ్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, అనంతగిరి గ్రామాల మీదుగా డి.భీమవరం వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని గిరిజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. రహదారిని గిరిజన సంఘం ప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఈ రహదారి దాదాపు పదేళ్ల క్రితం నిర్మించారన్నారు. అప్పటి నుంచి నేటికి నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరిందన్నారు. 25 కిలోమీటర్ల నిడివిగల ఈ రహదారి మెరుగుపరిస్తే రాజవొమ్మంగి నుంచి అడ్డతీగల మండలాలకు దగ్గరి దారి ఏర్పడుతుందని, ఈ ప్రాంతంలోని వేలాది మంది గిరిజనులకు ఈ రహదారి ఎంతో అవసరమన్నారు. పెద్ద పెద్ద గోతులు పడి ఈ రహదారిపై కనీసం ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ


శివలింగం ఆకృతిలో దీపాలంకరణ

మునగపాక : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగం అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. మహిళలు వందల సంఖ్యలో ప్రమిదలను నూనె, ఒత్తి వేసి వెలిగించి, శివపంచాక్షరీ మంత్ర పఠనంతో శివలింగాకృతిని నిలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీపాలంకరణ జరిగింది.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి : మండలంలోని చందనాడలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. చందనాడ, నల్లమట్టిపాలెం, తమ్మయ్యపేట తదితర గ్రామాల నుంచి వందలాది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఆశల సాగు

- పూర్తయిన రబీ వరి నాట్లు
- వెదజల్లు పద్ధతిపైనే మొగ్గు


చెరకుంపాలెంలో పొలంబడి కార్యక్రమంలో వరి సాగుపై రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

రాజవొమ్మంగి: మండలంలో అక్కడక్కడా రైతులు రబి వరి సాగు చేపడుతున్నారు. కొండవాగులు, సాగునీటి వనరులు ఉన్నా పశువుల బెడద, ఇతర అడవి జంతువుల సమస్యతో సతమతమవుతున్న రైతులు వేసవి పంటలపై ఆశ వదులుకొంటున్నారు. అయితే కొంతమంది రైతులు ఏదో విధంగా వరి, పొగాకు, మొక్కజొన్న, క్యాలీఫ్లవర్, వంగ తదితర పంటలను పండిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో వేసవి వరి పంటపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నాట్లు పూర్తయ్యాయి. మరి కొంత మంది రైతులు వెదజల్లు పద్ధతి అనుసరిస్తున్నారు. మండలంలో ఖరీఫ్ వరి దాదాపు 5వేల హెక్టార్లలో సాగవుతుండగా రబీలో నామమాత్రంగా 200 ఎకరాల్లో (సుమారు 80 హెక్టార్లు) మాత్రమే ఈ ఏడాది రబీ వరి సాగు చేపట్టారు. వరి పంటను పశువులు, అడవి జంతువుల నుంచి కాపాడుకొనేందుకు రకరకాల పద్ధతులను అనుసరిస్తున్నారు. పొలం చుట్టూ ఇనుప కంచెలు, కొన్నిచోట్ల ప్లాస్టిక్ నెట్ ఏర్పాటు చేస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పంటను కాపాడుకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ పద్ధతిలో వరి నారుమడులు ఏర్పాటు, నాట్లు ఖర్చు తగ్గుతుందని రైతాంగం భావిస్తోంది.

ఆర్ఎన్ఆర్ రకం వరికి డిమాండ్

మండలంలో అధికంగా రబీ పంటగా రైతులు ఆర్ఎన్ఆర్ 15048 (రాజేంద్రనగర్) ఎక్కువగా వేశారు. బియ్యంలో గ్లూకోజ్ శాతం తక్కువగా ఉండే ఈ రకం బియ్యం సుగర్ పేషెంట్లకు ఉపయోగపడుతుందని వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఈ రకం వరికి ప్రస్తుతం డిమాండ్ పెరిగిందన్నారు. మండలంలోని 195.2 ఎకరాల్లో రబీ సాగవుతుండగా 193 ఎకరాలకు ఈ-క్రాపు బుకింగ్ అయ్యిందన్నారు. ఈకేవీసీ 180.56 ఎకరాలకు పూర్తయినట్టు చెప్పారు. రబీ వరికి సోకే తెగుళ్లు, చీడపీడల నివారణకు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నట్టు చెప్పారు.


రాజవొమ్మంగిలో వరుస పద్ధతిలో వరి సాగు

మండలంలో రబీ సాగవుతున్న గ్రామాలు

ప్రాంతం	ఎకరాలు
జీలుగుపాడులో	3 ఎకరాలు
కిండ్రలో గ్రామంలో	3
రాజవొమ్మంగి	6.12
గింజర్తి	9.62
తంటికొండలో	1.3
సింగంపల్లిలో	8.02
వెలగలపాలెంలో	5.0
జడ్డంగి గ్రామంలో	132.09
మర్రిపాలెంలో	27.05

వరికి సోకే మొవ్వు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏవో రమేష్‌నాయుడు సూచించారు. క్లోరిఫైరిఫైస్ 2ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి మొవ్వుకుళ్ళును నివారించుకోవచ్చని సూచించారు.

మిరపలో తెగుళ్ల నివారణకు సూచనలు

రాంబిల్లి : మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించినట్టు హరిపురం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పలు గ్రామాల్లో మిరప పంటను పరిశీలిస్తే నల్ల తామర పురుగు ప్రభావం కనిపించిందన్నారు. రైతులు సకాలంలో ఈ పురుగు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పురుగు పూత దశలో రసం పీల్చివేయడం ద్వారా పిందె కట్టకుండా చేస్తుందన్నారు. మిరపతో పాటు పెసర, మినుము పంటల్లో కూడా ఈ నల్ల తామర పురుగు కనిపించినట్టు పేర్కొన్నారు. ఎకరాకు 8 కిలోల చొప్పున ఫిప్రోనిల్ గుళికలను తగినంత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలన్నారు. ఎకరాకు 10 పసుపు రంగు, 10 నీలం రంగు జిగురు అట్టలను పొలంలో కట్టాలని సూచించారు. అవసరం బట్టి 2 మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

అనకాపల్లిటౌన్: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి, గోవిందమాంబ అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కల్యాణంలో వ్యాపారవేత్తలు కె.సురేష్, దుర్గ అమ్మాజీ, పి.కృష్ణమూర్తి, రాణీమణి దంపతులు పాల్గొన్ని స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆదివారం పట్టణ కామాక్షి కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం ప్రతినిధులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో జాగరణ

- ఘనంగా మహాశివరాత్రి ప్రత్యేక పూజలు
- మార్మోగిన శివ నామస్మరణ
- నదీజలాల్లో భక్తుల పుణ్యస్నానాలు


జడ్డంగిలోని కొండగుహలో మల్లికార్జునస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


జడ్డంగిలోని తిరునాళ్లలో గ్రామస్తులు


రాజవొమ్మంగిలో రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఊరేగింపు

రాజవొమ్మంగి: మహాశివరాత్రి జాగారాలు మండలంలో రెండో రోజూ ఆదివారం కూడా సందడిగా సాగాయి. జడ్డంగిలో భ్రమరాంభికా మల్లికార్జున స్వామి, రాజవొమ్మంగి కొండపై రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, కుంతీదేవి వాకలో కుంతీలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంకాలం రామలింగేశ్వరస్వామిని పల్లకిలో ఊరేగించారు. జడ్డంగిలో భ్రమరాంభికా మల్లికార్జున స్వామి వారి ఊరేగింపు, రాజవొమ్మంగి శివాలయంపై పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం శనివారం రాత్రి కనులపండువగా జరిగింది. జడ్డంగిలో ఏర్పాటుచేసిన తిరునాళ్లలో పిల్లలు, పెద్దలు సందడి చేశారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత కె.జె.పురం


బహుమతులు అందజేస్తున్న గౌరీపరమేశ్వర భజన సేవా బృందం సభ్యులు

మాడుగుల రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని కె.జె.పురం శివాలయం వద్ద జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కె.జె.పురం జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 25 జట్లు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రథమ బహుమతి కె.జె.పురం జట్టుకు రూ. 10 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులు బుచ్చెయ్యపేట జట్టుకు రూ. 8 వేలు, విశాఖపట్నం జట్టుకు దక్కాయి. ఆదివారం తెల్లవారుజామున గౌరీపరమేశ్వర భజన సేవా బృందం సభ్యులు, గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.

వేడుకగా పెళ్లిరాట


వేడుకలో పాల్గొన్న భక్తులు

మునగపాక : మండల కేంద్రమైన మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో ఆదివారం పెళ్లిరాట మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. కాశీ విశాలాక్షి సహిత విశ్వేశ్వరస్వామి వివాహ కార్యక్రమంలో భాగంగా వేద పండితులు సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాట మహోత్సవంలో ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, పెద్దలు పెంటకోట జగన్నాథం, పెంటకోట సూర్యనారాయణ, చిన్న, తేలు నూకరాజు, కిరణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోతురాజుబాబు ఉత్సవాలు


కొండపాలెం చాకలి చెరువు వద్ద ఎడ్లబళ్ల పోటీ

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో పోతురాజుబాబు ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాలకు భక్తులు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రోలుగుంటలో మద్దు ఎర్రోడు, అచ్చియ్య, వల్లయ్య పాకల వద్ద ఆలయాల్లో వారి కుటుంబీకులు ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు కొండపాలెం, జె.నాయుడుపాలెం గ్రామాల్లోనూ నిర్వహించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు

రోలుగుంట: కొండపాలెంలో పోతురాజుబాబు ఉత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలను నిర్వహించారు. మాడుగుల, రోలుగుంట, చీడికాడ మండలాల నుంచి ఆరు బళ్లు పాల్గొన్నాయి. ఎం.కొత్తపల్లికి చెందిన నంబారు రాజబాబు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ఎం.కొత్తపల్లికి చెందిన పరదేశమ్మకు ద్వితీయ బహుమతిగా రూ. 8 వేలు, కె.ఎల్.బి.పట్నానికి చెందిన గండి ఆనంద్‌కు తృతీయ బహుమతిగా రూ 6 వేలు, కొండపాలెం గ్రామానికి నుంచి రైతు ఎడ్లబండికి నాల్గో బహుమతిగా రూ.4 వేలు చొప్పున సర్పంచ్ బంటు లక్ష్మి, ఉప సర్పంచ్ చిరంజీవి ప్రదానం చేశారు. బంటు మోహన్, కర్రి శ్రీను మారుతి లోవరాజు, పోతు గణేష్, బద్ది రాము పాల్గొన్నారు.


కొండపాలెంలో పోతురాజుబాబుకు పూజలు చేస్తున్న భక్తులు

మామిడిపాలెంలో

మాకవరపాలెం: మామిడిపాలెంలో పోతురాజుబాబు పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో ఏటా ఈ పండగను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి గ్రామస్తులు పోతురాజుబాబు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా బల్లల పండగ

మాడుగుల రూరల్: కె.జె.పురంలో రజకుల బల్లలు పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి పండగ తర్వాత చాకిరేవు వద్ద భక్తి ప్రవత్తులతో ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా రజకులు పసుపుకుంకుమ, బ్యాండు మేళాలతో ఊరేగింపుగా పెద్ద చెరువులో చాకిరేవు వద్దకు వెళ్లి అక్కడ బల్లలకు పూజలు చేశారు.